క్లుప్తంగా

జీడీనెల్లూరు ఎస్ఐగా రామాంజనేయులు



గంగాధరనెల్లూరు: మండల ఎస్ఐగా బండి రామాంజనేయులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గుడిపల్లి మండలంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు వీఆర్‌కు వెళ్లారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఐకమత్యంగా ఉంటూ గ్రామాల అభివృద్ధికి ప్రజలు కృషి చేయాలని, యువత సమాజానికి ఆదర్శంగా ఉండాలని సూచించారు.

నేడు ఈస్టర్ వేడుకలు



విద్యుత్ కాంతుల్లో సెయింట్ మేరీ చర్చి

నగరి : ఏసుక్రీస్తు పునరుత్థానాన్ని పురస్కరించుకుని ఆదివారం ఈస్టర్ వేడుకలను క్రిస్టియన్లు ఘనంగా నిర్వహించనున్నారు. అందుకోసం పట్టణ పరిధిలోని చర్చిలను విద్యుత్‌దీప కాంతులతో ముస్తాబు చేశారు. చర్చిల వద్ద ఏర్పాటుచేసిన విద్యుత్ కాంతుల్లో చర్చిలు శోభాయమానంగా కనిపించాయి.

పదో తరగతి పరీక్ష కేంద్రం తనిఖీ

పాలసముద్రం : మండలంలోని పాలసముద్రం ఉన్నత పాఠశాలల్లో శనివారం జరిగిన పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షను డీవైఈఓ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు పరీక్ష రాయడానికి కావలసిన మౌలిక వసతులు, తాగునీరు వసతిని పరిశీలించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చీఫ్, డిపార్టుమెంట్ ఆఫీసర్ ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరుగుతుండడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

మాస్క్ వినియోగం తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న రాజేంద్రప్రసాద్

గంగాధరనెల్లూరు: కరోనా వ్యాధి సోకకుండా ముఖానికి మాస్కు తప్పనిసరిగా ధరించాలని ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని కాశేపల్లి ఎస్సీ కాలనీలో శనివారం కరోనా వ్యాధిపై అవగాహన కల్పించారు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఆయాసం, శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిగా ఉంటే కరోనా పరీక్షలు చేసుకోవాలన్నారు. ఆరు అడుగుల దూరం పాటిస్తూ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వరలక్ష్మి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న విహారం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం తిరుచ్చిపై భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఊంజల్ సేవను కనుల పండువగా చేపట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు అచల మహాసభలు

తిరుపతి కల్చరల్: యోగాచల ధార్మిక సేవా సంఘం జిల్లా శాఖ, నిర్భయానంద మోహనస్వామి సంయుక్తంగా ఆదివారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఉదయం 4.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అచల మహాసభలు నిర్వహిస్తున్నట్లు అచల మహాసభల ఆహ్వానితులు జగన్‌మోహన్‌రెడ్డి, రమణ, కల్పన తెలిపారు. ఇందులో భాగంగా గురుపూజ, గురుగీతా పారాయణం, జెండా ఆవిష్కరణ, నగర సంకీర్తన, అనంతరం సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రాహుల్‌గాంధీ అరెస్ట్ అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న జంగా గౌతమ్

నగరి: రానున్న ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధానిని చేసుకుందామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జంగా గౌతమ్ అన్నారు. శనివారం ఆయన ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో నగరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ అరెస్ట్ అన్యాయమని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడానికి, రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఈట సురేష్ బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ భానుమూర్తి, మాజీ వైస్ చైర్మన్ బాబు, నాయకులు అల్లాపిచ్చై, చిరంజీవిరెడ్డి, నటరాజన్, డిల్లీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపలో సంక్షేమం మాటే

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా ప్రతి ఇంటా.. ప్రతి నోటా జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాల మాటే వినిపిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శనివారం మండల పరిధిలోని విలాసవరహాపురం పంచాయతీ ఆరిమాకులపల్లి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. గ్రామానికి చెందిన చిన్నపాపమ్మ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక మా ఇంటి వద్దకే వచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఆనందం వ్యక్తం చేసింది. గతంలో చాలామంది తమ ఇళ్ల వద్దకు ఓట్ల కోసం వచ్చారే తప్ప, ఇలా సంక్షేమ పథకాలు ఇళ్ల వద్దే అందించడం ఇదే తొలిసారి అన్నారు. అలాగే పలువురు మహిళలు మాట్లాడుతూ మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీని నెరవేర్చిన సీఎం జగనన్నకు కృతజ్ఞతలు అని, రానున్న ఎన్నికల్లో జగనన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవడానికి తామంతా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. చంద్రబాబు హయాంలో కరువు కాటకాలతో తల్లడిల్లిపోయాయని, ఇప్పుడు రాష్ట్రం సుభిక్షంగా ఉందని కొనియాడారు.

కులమతాలకు అతీతంగా పథకాలు..

అనంతరం డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ గ్రామాల్లో ఏ ఇంటికి వెళ్లినా కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ జగనన్న పాలనే ఉండాలని ఆశీర్వదిస్తున్నారని తెలిపారు. నవరత్నాల పథకాలే ప్రజలకు జీవనాడి అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలు అవుతున్నాయని, దేశానికి దిశా, దశ నిర్దేశించే ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్ని కుయుక్తులు పన్నిన ప్రజలు సీఎం జగనన్న పక్షాన ఉన్నారని, ఇలాంటి పెత్తందారులు ఏమీ చేయలేరని అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి టీడీపీ, జనసేన పార్టీలు ఒక్కటై అలజడులు సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలంతా జగనన్న పాలనను స్వాగతిస్తున్నారని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు జయశంకర్‌నాయుడు అత్త సుశీలమ్మ ప్రభుత్వ పథకాలు అన్ని పొందుతున్నప్పటికీ కావాలనే ప్రభుత్వంపై వ్యతిరేకంగా మాట్లాడుతూ నీచబుద్ధిని చాటుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మమ్మ, మండల కన్వీనర్ మణి, మాజీ కన్వీనర్ అనంతరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి, జనార్దన్, ప్రసాద్‌రెడ్డి, డిసెంబర్‌శెట్టి, దామునాయుడు, కాలప్ప, తహసీల్దార్, లోకనాథపిళ్ళై, ఎంపీడీఓ కృష్ణయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

పేదల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ పేదల పక్షపాతిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. దరిద్రానికి, కరువుకు గ్రీన్ అంబాసిడర్ నారా చంద్రబాబు అని, అతను రాష్ట్రానికి పట్టిన పెద్ద శని అని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వంలో కమీషన్ల కోసం నిర్మాణం చేపట్టిన టిడ్కో ఇళ్ల వద్ద సిగ్గు విడిచి సెల్ఫీలు తీసుకుంటున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబుకు దమ్ము, ధైర్యం ఉంటే తమ ప్రభుత్వ హయాంలో పూర్తి చేసిన సంగం, నెల్లూరు బ్యారేజీ వద్దకు వెళ్లి సెల్ఫీ తీసుకోగలవా అని ప్రశ్నించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ప్రజలు చేసిందేమీ లేదని ఆరోపించారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు రైతులకు రుణమాఫీ చేస్తామని 2014లో చెప్పి అధికారంలోకి వచ్చాక చేతులెత్తేశారని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలు అణచివేతకు గురయ్యారని ఆరోపించారు. జన్మభూమి కమిటీలు ప్రజలను వేధించిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. చంద్రబాబు చేసిన మోసాలను, అన్యాయాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించడంతో పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి గురించి 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న మంత్రి ఆర్‌కే రోజా

- గ్రామాల్లో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయండి
- తాగునీటి వనరులపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- మంత్రి ఆర్‌కే రోజా

నగరి (విజయపురం) : మండలంలోని ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకమై సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. శనివారం విజయపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జమున అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సతీష్ మాట్లాడుతూ శాఖల వారీగా అధికారులు జరిగిన అభివృద్ధిని వివరించాలన్నారు. అనంతరం మంత్రి రోజా మాట్లాడుతూ అధికారులు ఆయా శాఖలకు సంబంధించి జరిగిన అభివృద్ధి పనులను, ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన నిధులతో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకం కావాలని, ఇంకా ఎవరికైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందడం లేదా? గ్రామంలో ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఏవైనా ఉన్నాయా ? అని గుర్తించి వాటిని పూర్తి చేయాలన్నారు. ఏవైనా స్థానికంగా పూర్తి కాని పనులను తన దృష్టికి తీసుకువస్తే తాను పరిష్కరిస్తానని మంత్రి సూచించారు. ప్రస్తుతం వేసవికాలం గనుక తాగునీటి వనరులపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే అవి వెంటనే సరి చేసి నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఆస్పత్రిలో వేసవి తీవ్రత కారణంగా వచ్చే అనారోగ్య సమస్యలకు సంబంధించి మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మందు కొరత ఉంటే ట్రస్టు ద్వారా అందజేస్తానని తెలిపారు. ఇళ్లస్థలాలు లేని అర్హులు ఎవరైనా ఉంటే వారిని గుర్తించి పట్టాలు అందేలా చూడాలన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లు జూన్, జూలై నాటికి పూర్తి చేయించాలని తెలిపారు. పశువులకు వ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్మశానానికి దారి వసతి లేని ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా దారి వసతి ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జమున, వైస్ ఎంపీపీలు బాలాజీ, దశరథరాజు, ఎంపీడీఓ సతీష్, తహసీల్దారు వెంకటరాయలు, ఆర్బీకే చైర్మన్ గుణశేఖర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు రాజేంద్రన్, డాక్టర్ సోమశేఖర్, ఎంపీటీసీలు సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి గడపలో 'జగనన్నే మా భవిష్యత్'కు ఆదరణ



నింద్ర: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

నింద్ర: మండలంలో జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని పలు సచివాలయ పరిధిలో నాయకులు ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలో నాయకులు ఇంటింటికి తిరుగుతూ రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతి గడపకు, మొబైల్ ఫోన్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రజలు పార్టీలకు అతీతంగా జగనన్నకు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారని అన్నారు. ఎలకాటూరు, కేఆర్ పాళెం, అత్తూరు, అరూరు, కొప్పేడు, అగరం గ్రామాల్లో కార్యక్రమాలు విజయవంతం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, వైస్ ఎంపీపీ శుభ, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, జిల్లా మహిళ కార్యదర్శి మేరి, స్కూల్ కమిటీ చైర్మన్ శివలింగారెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్ కుప్పరాజు, రేవతి, శివఆచారి, సుబ్రమణ్యం యాదవ్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్ఈఏ క్రికెట్ విజేత కేవీఎస్ కింగ్స్ జట్టు



ఏపీఎస్ఈఏ టోర్నీ విజేతగా నిలిచిన కేవీఎస్ కింగ్స్ జట్టు

గంగాధరనెల్లూరు: ఆంధ్రప్రదేశ్ సర్వేయర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ విజేతలుగా కేవీఎస్ కింగ్స్ జట్టు నిలిచిందని జిల్లా సర్వేయర్ అసోసియేషన్ అధ్యక్షురాలు మంజుల తెలిపారు. శనివారం మండలంలోని ఎట్టేరి వద్ద తొమ్మిదో మైలు క్రీడా మైదానంలో జరిగిన ఈ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఉద్యోగ ఒత్తిడితో ఉన్నవారికి ఉపశమనం కోసం ప్రభుత్వం క్రీడలను నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం విజేతలుగా కేవీఎస్ కింగ్స్ జట్టు విజేతగా నిలిచిందని, పెనుమూరు సర్వేయర్ టీమ్ రన్నర్స్‌గా నిలిచిందన్నారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా చరణ్‌తేజ, బెస్ట్ బౌలర్‌గా కృష్ణమూర్తి, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా సాయికుమార్ నిలిచారన్నారు. విజేతలకు 10వ తేదీ సోమవారం సర్వేయర్స్ డేను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రంతో పాటు కప్‌ను అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వెంకటరమణ, కార్యదర్శి గిరి, జిల్లా సర్వేయర్ అసోసియేషన్ ఈసీ మెంబర్స్, పలువురు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్లపల్లె శ్రీ కోండదరామ స్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీరామ పట్టాభిషేకం ఘట్టాన్ని ఘనంగా చేపట్టారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని పుష్పపల్లకిపై వేంచేపు చేసి పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు పెద్దఎత్తున మంగళ హారతులు ఇచ్చి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాలకు రాంప్రసాద్, కృష్ణ ప్రసాద్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యనిర్వాహక సభ్యుడు బండి ఆనందరరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రచయితల వర్క్‌షాప్‌కు పాటలు, నాటికలు పంపండి

తిరుపతి కల్చరల్: తెనాలిలో 10, 11, 12 తేదీల్లో నిర్వహించే రచయితలు, కళాకారుల వర్క్‌షాప్‌కు యువ కవులు, రచయితలు, కళాకారులు తమ రచనలతో హాజరుకావాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య పిలుపునిచ్చారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. దేశంలో నరేంద్రమోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఇతి వృత్తంగా తీసుకుని సామాన్య, మధ్య తరగతి ప్రజల కష్టాలను వివరిస్తూ రచయితలు తమ కలాలకు పదును పెట్టాలని కోరారు. ప్రధానంగా పాటలు, నాటికలు, నాటకాలు, స్కిట్స్ రూపంలో రచనలు చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ రచనలను తెనాలిలో జరిగే వర్క్‌షాప్‌కు స్వయంగా రావడం, వాట్సాప్ ద్వారా 9885228869, 9866288553కు పంపాలని తెలిపారు.

గ్రామీణ ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ సేవలు



రోగులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ పల్లవి

శ్రీరంగరాజపురం: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని శ్రీరంగరాజపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ పల్లవి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఏఎంపురం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ వైద్యసేవలు అందుబాటులో సక్రమంగా అందాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి 15 రోజులకు ఓసారి గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్యం అందిస్తారని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ వైద్యసేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే వేసవి దృష్ట్యా వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం వడదెబ్బపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

సారా అరికట్టేందుకు చర్యలు



ఎస్ఐ లోకేష్

వెదురుకుప్పం: సారా తయారీని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ లోకేష్ అన్నారు. శనివారం వెదురుకుప్పం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సారా రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. సారా తయారీ, అమ్మకాల వల్ల చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఎక్కడైనా తయారు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి సేవలు అందించేందుకైనా తాము సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. పోలీసులపై ప్రజల్లో నమ్మకం కలిగేలా వ్యవహరించి వారికి భరోసా కల్పిస్తామన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

క్రీడలతో స్నేహభావం పెంపు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ

కార్వేటినగరం: గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో స్నేహభావాన్ని పెంపొందించేందుకు క్రీడలు ఎంతో దోహదపడుతాయని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. కార్వేటినగరం పెద్ద దళితవాడ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ క్రీడలను జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ మండల పార్టీ కన్వీనర్ ధనంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ విజయం కోసం పట్టుదలతో పోటీ పడాలని సూచించారు. అనంతరం మాజీ మండల కన్వీనర్ ధనంజయవర్మ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడాపోటీల ప్రారంభం సందర్భంగా ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ దొరబాబు, నిర్వాహకులు పాల్గొన్నారు.

రాహుల్‌కు మంత్రి ప్రశంసలు



జు జుట్స్‌లో ప్రతిభ చూపిన రాహుల్ కుటుంబంతో మంత్రి ఆర్‌కే రోజా

నగరి (విజయపురం) : జపనీస్ యుద్ధ కళ అయిన 'జు జుట్సు చాంపియన్ షిప్' పోటీల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచి వెండిపతకం సాధించిన యువకుడు రాహుల్‌ను మంత్రి ఆర్‌కే రోజా సన్మానించారు. మండలంలోని నారపరాజు కండ్రిగ గ్రామానికి చెందిన శోభ, రామకృష్ణమరాజు దంపతుల కుమారుడైన రాహుల్ శనివారం తన కుటుంబ సభ్యులతో పాటు విజయపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయానికి విచ్చేశారు. జు జుట్స్ యుద్ధకళలో తాను సాధించిన పతకాన్ని మంత్రికి చూపి ఆమె ఆశీస్సులు అందుకున్నారు. ఆదివారం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని దివాస్ నగరంలో నిర్వహించిన జాతీయస్థాయి జు జుట్స్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని పతకం సాధించినట్లు వివరించారు.

పేదల ఆశాజ్యోతి జగనన్న



స్టిక్కర్ అందిస్తున్న కౌన్సిలర్ బాలాజీ



ఎస్‌బీఆర్ పురంలో ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరిస్తున్న సురేష్‌రాజు

వడమాలపేట : పేదల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారులకు అందిస్తూ పేదల ఆశాజ్యోతిగా సీఎం జగనన్న చరిత్రలో నిలిచిపోతున్నారని మండల జేసీఎస్ కన్వీనర్ సురేష్‌రాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎస్‌బీఆర్ పురం, కల్లూరు, టీసీ అగ్రహారం, ఏఎంపురం సచివాలయం పరిధిలోని గ్రామాల్లో 'మా నమ్మకం నువ్వే జగన్- జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని మండల నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల కాలంలో ప్రతి ఇంటికీ దాదాపు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు అనేక రకాల సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి, బాబు, తిమ్మయ్య, మునిబాబు, వెంకటేష్, ఉమాపతి, సుబ్రమణ్యంరాజు, తదితరులు పాల్గొన్నారు.

నగరిలో..

నగరి : జగనన్నే మా భవిష్యత్ అనేది జనంలో నుంచి వచ్చిన మాట అని మండల సచివాలయాల కన్వీనర్ హరిబాబు అన్నారు. శనివారం తడుకుపేట పంచాయతీలో ఆయన మా నమ్మకం నువ్వే జగనన్న- జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ఆవరణలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. సంక్షేమ పథకాల లబ్ధిపై ప్రజల అభిప్రాయం తెలుసుకోవడానికి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కన్నియప్ప, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ మేలు జరిగిందని, 2024లో కూడా వైఎస్సార్‌సీపీకే తమ మద్దతు అని ఆముదాల దళితవాడ గ్రామస్తులు తెలిపారు. స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్ శనివారం ఆముదాల సర్పంచ్ అనురేఖ, ఎంపీటీసీ లిఖితతో పంచాయతీలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గృహసారథులు, వలంటీర్లు, పుత్తూరు కేశవరెడ్డి, మురళి, చంద్రశేఖర్‌రాజు, సుందరాజు, వేణు, గోపాల్ అరుల్, మదివానన్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు రూరల్: ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతో ఉన్నారని 12వ వార్డు కౌన్సిలర్ ఎస్.బాలాజీ తెలిపారు. శనివారం వార్డు పరిధిలోని కుందిమాకుల గుంట, ముత్తరాశి కండ్రిగ గ్రామాల్లో ''జగనన్నే మా భవిషత్తు'' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో మీరు సంతృప్తిగా ఉన్నారా అంటూ ప్రశ్నిస్తే సంతృప్తిగా ఉన్నామని సమాధానం చెబుతున్నారని తెలిపారు. కన్వీనర్ రామచంద్రయ్య, గృహ సారథులు నిరంజన్‌కుమార్, ప్రియ, శ్యామల, వరలక్ష్మీ, వలంటీర్లు మమత, సాయికుమార్, శోభ పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని శనివారం ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి యజమానుల అనుమతితో పార్టీ స్టిక్కర్లను అంటించారు. బుక్కాపట్నంలో ఎంపీపీ అనితారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్న వెంకన్న గ్రామోత్సవం



అప్పలాయగుంట పురవీధుల్లో ప్రసన్న వేంకటేశ్వర స్వామి కటాక్షం

వడమాలపేట : టీటీడీ అనుబంధ ఆలయమైన అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చి గ్రామోత్సవం, ఊంజల్‌సేవను ఆలయ అధికారులు శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాలసేవ, నిత్యకైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించారు. అనంతరం వేదపండితులు మంత్రాలు పఠిస్తూ భక్తుల గోవిందనామస్మరణ నడుమ శ్రీవారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితడైన పద్మావతి ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని మంగళవాయిద్యాలు నడుమ మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వరుసగా రెండురోజులు సెలవు కావడంతో ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. రాత్రి స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీసీల జనగణనపై కేంద్రం నిర్లక్ష్య వైఖరి

తిరుపతి కల్చరల్: బీసీల జనగణన చేపట్టడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అనుసరిస్తోందని ఏపీ బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు శొంఠి నాగరాజు విమర్శించారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా దేశంలోని బీసీ కులాలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. దేశంలో జంతువుల లెక్కలు ఉన్నాయని, బీసీ కులాలకు లెక్కలు లేకపోవడం శోచనీయమన్నారు. బీసీలకు జనగణన కులగణన చేయాలనే ప్రధాన డిమాండ్‌తో కేంద్రం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నట్లు తెలిపారు.

వేసవి సెలవుల్లో బదిలీలు చేపట్టాలి

తిరుపతి ఎడ్యుకేషన్ : వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేట్టాలని తిరుపతి జిల్లా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ప్రతినిధులు కోరారు. వారు శనివారం ఎస్వీయూ క్యాంపస్ పాఠశాలలో జేడీ సర్వీసెస్, పది పరీక్షల ప్రత్యేక పరిశీలకులు మువ్వా రామలింగంను కలిసి విన్నవించారు.

టీచ్ టూల్‌తో బోధన మెరుగు

రామచంద్రాపురం: టీచ్ టూల్‌తో ఉపాధ్యాయుల బోధనను మెరుగుపడుతుందని సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకర్ తెలిపారు. ఆయన శనివారం గంగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనం, లేఖనం, రేఖాగణిత నైపుణ్యాలను అభివృద్ధి పరచాలన్నారు. హెచ్ఎం మైథిలీ, మారయ్య, టీచ్ టూల్ పరిశీలకులు నాగేంద్ర పాల్గొన్నారు.